# పునర్జన్మ

"మధ్యాహ్నం ఒకసారి వస్తారూ, మీతో మాట్లాడాలి" అన్నారు రాజారావుగారు.

"అలాగే వస్తానండీ" అన్నాను వెంటనే. ఆయన వెళ్ళిపోయారు. ఆయన అటు వెళ్లగానే మళ్ళీ నాలో ఆలోచన రేకెత్తింది.

రాజారావుగారు ఆ బడిలో పదేళ్ళ నుండీ పని చేస్తున్నారు. నేనక్కడికి వెళ్ళి నాలుగు సంవత్సరాలే అయింది. అయినా వారితో నాకంత పెద్ద పరిచయం లేదు. కనిపించినపుడు మాత్రం చిరునవ్వుతో పలకరించే వారు. పెద్దవారిపట్ల సహజంగా ఉండే గౌరవ భావం చేత నేనెక్కువగా మాట్లాడే వాణ్ణి కూడాకాను.

ఆ మధ్య ఒకసారి "మీ వద్ద ఏవైనా పుస్తకాలున్నాయా" అంటూ వచ్చారు. ఎలాంటి పుస్తకాలు కావాలని అడిగాను.

"మా పెద్దమ్మాయి కలకత్తాలో ఉందండీ. అక్కడేమో తెలుగు పుస్తకాలు దొరకవు. అంచేత అప్పుడప్పుడు పంపుతుంటాను" అన్నారాయన.

నాలుగో ఐదో నా వద్ద ఉన్న కథల పుస్తకాలు తెచ్చి యిచ్చాను. ఆయన పట్టుకెళ్ళారు. అప్పటి నుండీ ఏదో కన్పించినపుడు ఒకటి రెండు మాటలు మాట్లాడుకొనే వాళ్ళం. అంతే వారికీ, నాకూ ఉన్న పరిచయం. అలాంటపుడు వారు నాతో మాట్లాడవలసిన అవసరం ఏమై ఉంటుందనే ఆలోచన నాకు కలగడం సహజమే. కానీ, సమాధానం మాత్రం నాకు దొరకలేదు.

ఆ మధ్యాహ్నం సరాసరి వారి వద్దకు వెడుతుండగానే వారే ఎదురు పడ్డారు. "మీ కోసమే వస్తున్నాను రండి" అంటూ హోటలు వైపు దారి తీశారు.

వెడుతూ వెడుతూ ఆయనే మొదలు పెట్టారు. చాలా ఆతురతగా ఏం చెబుతారోనని యెదురు చూశాను.

"ఈ కార్డును చూడండి" అంటూ ఒక పోస్టు కార్డును నా చేతికి అందిచ్చారు. చదివాను. "లీలా ఎక్స్‌పయర్డ్ ఆన్ టెన్త్ మార్నింగ్" శ్యామారావు" ఒక్కటే వాక్యం ఉన్నది. ఆయనవైపు చూస్తూ "ఎవరీ లీల" అంటూ ప్రశ్నించాను.

మీ వద్ద పుస్తకాలు కూడా తీసి పంపాను జ్ఞాపకముందను కొంటాను. ఆమే" అన్నారాయన.

"కలకత్తాలో ఉన్న మీ అమ్మాయే" అంటూ దిగాలు పడి నిలబడిపోయాను.

"అవును" అంటూ హోటలు మేడ మెట్లక్కడానికి ఉపక్రమించారు రాజారావు గారు. అయ్యో! అన్పించింది నాకు. పాపం ఎలా భరిస్తున్నాడీ దుఃఖాన్ని! కలకత్తాలో ఆమె చనిపోతే ఈయనెలా వెళ్ళగలడు? అందులోనూ కార్డు వ్రాస్తే అది ఏ మూడో రోజో అందుతుంది గదా! వెడితే విమానంలో వెళ్ళాలి. ఈ శ్రమంతా ఎందుకని కార్డు వ్రాశారేమో! పాపం రాజారావుగా రెలా తట్టుకోగలరీ దెబ్బకు అన్పించింది.

కన్న కూతురి వియోగం సామాన్యమైందా!

"ఏం జబ్బండీ" అన్నాను కూర్చుంటూ రాజారావు గారితో "జబ్బేమీ లేదు. ఏ విషయమూ తెలియదు. ఈ కార్డు అందింది. ఈ కార్డు సరాసరి ఇంటి చిరునామాకు వచ్చింది. నేను బడిలో ఉండగా ఫోన్ చేశారు. అమ్మాయి పోయిందనగానే ప్రాన్పడిపోయాను. ముందు మా చిన్నమ్మాయి మీద నా దృష్టి పోయింది. గబగా చిన్నమ్మాయి వద్దకు వెళ్ళాను. నే నెలా వెళ్ళానో నాకు తెలియదు. బహుశా యాంత్రికంగా జరిగి ఉంటుంది. చిన్నమ్మాయిని చూశాక ఇంటికి వెళ్లాను. అందరూ ఏడ్పుల్లో ఉన్నారు. మా పెద్దమ్మాయి పోయిందంటే కార్డు వ్రాస్తారా? అంత నిర్లక్ష్యంగా కార్డు ఎందుకు వ్రాస్తారు? ఏ టెలిగ్రామో ఇస్తారు కానీ" అనే ఆలోచన కూడా నాకు కలగలేదు. రెండు మూడు గంటలు గడిచాక మళ్ళీ ఆలోచించాను. కానీ, అమ్మాయి బ్రతికి ఉంటుందనుకోవడం వెర్రిగా తోచింది నాకు. ఎంతో బాధతో నా గుండెలు దహించుకొని పోయాయి. కార్డును తీసుకొని మరో స్నేహితుని దగ్గరకు వెళ్ళాను.

"చాలా దూరంలో ఉన్నారు. తంతి పంపితే బయలుదేరి శ్రమ పడిపోతారు. మూడు రోజులకు గానీ చోటు ఎటూ చేరుకోలేరు గనుక కార్డు వ్రాసి ఉంటారు" అన్నారాయన. అవును. అంతే ఉంటుందనిపించింది. ఏడుస్తూ ఇల్లు చేరుకొన్నాను. అందరి ముఖాల్లో విషాదం. అందరి కళ్ళల్లోనూ నీళ్ళు. ఒక్కరూ మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు.

తెనాలిలో మా అబ్బాయి ఉన్నాడు. వాడికో ఉత్తరం వ్రాద్దామని తోచి వెంటనే కార్డు వ్రాశాను. ఏమి చేయడానికీ తోచలేదు. ఎటు తిరిగి కలకత్తాకు వెడితే

మంచిదని తోచింది. అన్నీ ముగిశాక అంత దూరం వెళ్ళి చేసేదేముంది?

దేనికీ అబ్బాయిని సంప్రదించడం మంచిదిగా తోచింది. అబ్బాయి ఏం వ్రాస్తాడోనని ఎదురు చూస్తూ పడుకొన్నాను. ఆ రాత్రి చాలా భయానకంగా గడిచింది. మరునాడు బడికి వచ్చి పదిరోజులు సెలవు వ్రాసి ఇంటికి వెళ్ళి పోయాను. మీరారోజు బడిలో లేరనుకొంటాను. ఇంటికి వెళ్ళి పడుకొన్నాను. ప్రతి క్షణమూ అమ్మాయి నా కళ్ళముందు మెదులుతోంది.

టపటపమంటూ నీటి చుక్కలు మేజామీద పడ్డాయి. అవి రాజారావుగారి కన్నీటి చుక్కలు. ఆయన గొంతు జీరవోయింది. ఆయన ముఖాన్ని విషాద చ్ఛాయలు క్రమ్మివేశాయి.

కన్న తండ్రి హృదయం గదా! ఎలా తరుక్కుపోతున్నదో! అసలాయన ఎలా పైకి లేచి నిలబడగలిగాడా అనుకొన్నాను. నా కాయనతో కలిగిన బహుకొద్ది పరిచయంతోనే ఆయన హృదయం చాలా మెత్తనిదని గ్రహించిన నాకు ఆయన నా స్థితిలో చూడటం చాల బాధగా కన్పించింది. ఆడబిడ్డల పెంపకంలో అనుభవమైన ప్రేమానురాగాలతో నాకూ కొంత పరిచయముంది. మానవుడు పోయే ప్రాణాన్ని నిలబెట్టలేడు. ప్రతి యొక్కరి ప్రాణమూ ఎప్పుడో ఒక నాటికి పోక తప్పదన్న గొప్ప సత్యం అందరికీ తెలిసిందే. అయినా ప్రాణానికి ముప్పు వచ్చినపుడు గిజగిజ లాడిపోతారు. తన కన్న బిడ్డకో, కన్న తల్లికో, ప్రేయసికో, ఏ ఆత్మీయ స్నేహితునికో ప్రమాదం సంభవించినపుడు తన ప్రాణాన్నైనా యివ్వగలనని భగవంతునితో మొరపెట్టుకొంటాడు. తన ఆయుస్సులో కావలసినన్ని సంవత్సరాలు తీసుకోమని కూడా ధ్యానించుకొంటాడు. భగవంతుడా మొరలను ఆలకిస్తాడో లేదో నన్న విషయం వేరు. కానీ అనురాగమూ, అభిమానమూ, ప్రేమా ఆ విధంగా వ్యక్తమవుతుంది. అంతేగాదు. చివరికి ఆత్మీయులకు ప్రాణం పోయిందని రూఢి అయిన తర్వాత కూడా ఆ విషయాన్ని నమ్మరు. శవానికి ప్రాణం రాగలదని భ్రమిస్తారు. దింపుడు కళ్ళం ఆశను కూడా వదలుకోరు. మనిషిలోని బలహీనతో లేక శక్తివంతమైన ప్రేమ యొక్క పరిణామమో తెలియదు. అలాంటి ప్రేమ పరిణామాన్నే పిచ్చి అంటాం తుదకు.

రాజారావుగారిని చూచినపుడు నా కివన్నీ జ్ఞప్తికి వచ్చాయి. ఆయన ఐదారు నిమిషాలు దుఃఖోద్వేగంతోనో లేక గడచిన మధురస్మృతుల దివ్యావలోకనంతోనో నిశ్శబ్దంగా ఉండిపోయారు. నేనూ అలాగే ఉండిపోయాను. ఆ కొద్ది నిమిషాలూ

ఆయన కుమార్తెను తలంచుకొని ఆమెను సాక్షాత్కరింప చేసుకొని ఉంటాడు. నేను కూడా నా అనుభవాలను నెమరు వేసుకొంటూ ఉండిపోయాను.

ఆయనను మాట్లాడించాలనుకొన్నాను. ఏమని ప్రారంభించాలో తెలియదు. ఇంతలో ఆయనే మరో ఉత్తరాన్ని తీసి యిచ్చారు. అది ఆయన కుమారుడు వ్రాసిన జాబు.

"మీ కందినట్లే నాకు కార్డు చేరింది. కానీ, లీల మరుగైందన్న విషయాన్ని నేను నమ్మలేక పోతున్నాను. అదే నిజమైతే ఆమె లేని లోటును నేనెలా భరించగలనో తెలియదు."

కుమారుడు,

నిరంజనరావు.

ఆ లేఖను చదివాక వెనుక నాకు కొంత ధైర్యం వచ్చింది. ఇంత స్పష్టంగా నేను నమ్మలేకపోతున్నాను అని వ్రాయడానికి కారణమేమిటి? పైగా నా అనుమానం దృఢం కావడానికి మరో కారణం కూడా ఉంది. లీల చనిపోయిందే దృఢమై ఉంటే రాజారావుగారు ఇట్లా బడికి రాగలరా? నాతో పాటు హోటలు మెట్లెక్కి రాగలడా? తారీఖును బట్టి చూస్తే అమ్మాయి చనిపోయి అది నాలుగో రోజు. కనుక ఈ జాబు నెవరో పగవాడు వ్రాశాడేమో అన్పించింది నాకు. కానీ, కార్డుముద్ర కలకత్తాదే. వ్రాత, సంతకం అన్నీ రాజారావుగారి అల్లుడుగారివే.

"టిఫిన్ తీసుకోకుంటే పోతుంది. కాఫీనైనా త్రాగండి" అంటూ కుర్రవాని వైపు తిరిగి రెండు కాఫీలు తీసుకురమ్మన్నాడు.

అయోమయావస్థలో ఉండిపోయాను. "ఈ జాబులు రెండూ చేరిన మూడు రోజులకు కార్డు అందింది" మూడో కార్డును ఎత్తి ముందుంచారాయన. కార్డును తీసి చదివాను.

"మహారాజ రాజశ్రీ మామగారికి నమస్కారములు చేసి అల్లుడు శ్యామారావు వ్రాయులేఖ. గత బుధవారం నాడు లీల కాకుల జంటను చూడ్డంవల్ల ఆ దోష పరిహారార్థం ఆమె చనిపోయినట్లు ఆత్మబంధువులకు జాబు వ్రాయమని పెద్దలు చెప్పారు. అంచేత మీకు కార్డు వ్రాశాను. లీల కేమీ భయం లేదు. ఆమె ఆరోగ్యంగానే ఉన్నది. అక్కడందరి క్షేమాలు తెలుపుతూ జాబు వ్రాయగోరెదను.

ఇట్లు. మీ అల్లుడు

శ్యామారావు"

"ఓరి పిడుగా!" అనుకొన్నాను. ఒక్కసారి నా గుండెల బరువు కూడా తగ్గిపోయింది. అరగంటలో నా హృదయం ఎన్నోమార్లు స్తంభించింది. ఒక్కోసారి ద్రవించిపోయింది. మరోసారి ఘనీభవించింది. ఎన్నో అనుభవాలు, మరెన్నో అనురాగ పూరితమైన స్నేహ సంబంధాలు నా స్మృతి పథంలో మెరిసిపోయాయి. విన్న నాకే ఇంత బాధ కలిగినపుడు కన్న తండ్రి ఎంత పరితపించి ఉంటాడో గదా! కన్న తల్లి ఎంతగా గుండెలను కరిగించుకొన్నదో! తోబుట్టువులు, అన్నదమ్ములు మరెంతగా ఏడ్చుకొని ఉంటారో! లక్ష పిడుగుల కంటే బలీయమైన, కోటి అణ్వస్త్రముల కంటె శక్తివంతమైన చావు కబురును సత్యమైనపుడే అందివ్వాలి గాని ఏదో సనాతన ఆచారాలూ మూఢ నమ్మకాలూ ఆధారంగా ఎందుకు కల్పించాలి!

ఆలోచించగా ఆలోచించగా ఎప్పుడైనా సరే ఎట్టి సందర్భంలోనైనా బంధు హింస పాపమని తోచింది నాకు. ఈలాంటి అసత్యమైన కబుర్లతో ఆత్మీయులను ఆవేదనల పాలు చేయడం అమాయకతగా తోచింది.

"ఇది తప్పుగదండి ఈ విజ్ఞాన యుగంలో కూడా ఈలాంటి నమ్మకాలను ఉంచుకొంటే ఎట్లా?" అన్నాను రాజారావుగారితో. ఆయన ప్రశాంతంగా నావంక చూస్తూ "శ్యామారావుది మాత్రం ఏ తప్పున్నది? అమ్మాయికేదో ప్రమాదం సంభవిస్తుందనే భయంతో ఆ దోష నివారణార్థం అట్లా వ్రాశాడు. పెద్దవాళ్ళ సలహా ప్రకారం ఆ విధంగా ఆయన వ్రాసిందే మంచిది" అన్నాడు.

అవును నిజమే. ఆ విధంగా ఉత్తరాలు వ్రాయకుంటే వూరుకోరు. శాస్త్ర ప్రకారం జరిగి తీరవలసిందే. అలాంటి సంఘంలో మనం ఉన్నంత వరకూ ఆ వాతావరణానికి అనుకూలంగా నడుచుకోవలసిందే. ఇంతకూ ఇందులో ఉన్న ఉద్దేశమేమిటని ఆలోచన మాత్రం నన్ను వదలలేదు.

ఏ వ్యక్తి కోసమైనా సరే నలుగురు ఆవేదన పడడం, తమ ప్రేమను వెల్లడించడం, ఆ వ్యక్తి కోసం పరితపించడం, భగవంతుని ధ్యానించడం జరిగి నపుడు, ఆ వ్యక్తి యొక్క క్షేమం భద్రపడుతుంది. అందుకే మనలో ఆత్మీయుల కోసం ప్రార్ధనలు చేయకున్నా మీ ఆయురారోగ్య ఐశ్వర్యార్థం భగవంతుని ప్రార్థిస్తున్నామంటూ ఉత్తరాల్లో వ్రాయడం అలవాటు. సందేశాలు పంపడం ఆచారం.

అలాంటి ఆశీర్వాదాలు ఎంతైనా అవసరమే. అవి లోపించినపుడు ఇలాంటి

సంఘటనలను కల్పించే ఉద్దేశాలు పెద్దవారికి కలిగాయేమో! కాకుల జంటను వాటి కలయికను చూడ్డం మహా దోషమని మనవారి నమ్మకం. దానికి పరిహారం కోసం అంతకంటే మహాస్త్రాన్ని ఉపయోగించాలని చావు కబురు చల్లగా అందివ్వమని ఉంటారు.

"ఇక పోదామా" అంటూ పైకి లేచాను. రాజారావు గారు కూడా పైకి లేచారు. వారిలో ముందున్నంత ఆవేదన లేదు. సంతృప్తిగా నవ్వుతూ "ఏదేమైనా అమ్మాయి క్షేమంగా ఉంది. చివరి జాబు అందకుండా వుంటే ఏమైపోయే వాణ్ణో గదా" అన్నారు.

"ఈ నమ్మకాలను నిరసించలేము. ప్రతి నమ్మకానికీ ఏదో ఒక ఆధారం ఉంది. కష్టాలలో ఉన్న వారిని గురించి దూర దేశంలోని ఆత్మీయులు ఆవేదన పడడం వలన ఆ మనోవేదనలు పరిదీవనలై వారి కష్టాలు ఉపశమిస్తాయి. హృదయాలకు, మనస్సులకు సంబంధించిన ఈ విషయాల గురించి పరిశోధనలు జరిగితే ఎన్నో అపూర్వ రహస్యాలు తెలుసుకోవచ్చు. ఆత్మీయుల కేదో సంకటాలు సంభవించినపుడు ఎంత దూరంలో ఉన్నప్పటికీ అకస్మాత్తుగా ఏదో ఆవేదన ఆరంభమవుతుంది. ఎడమకన్ను అదిరిందనో, ఎందుకో మనస్సు బావుండలేదనో అంటుంటాము. ఒకసారి సాయంకాలం నేను పొరుగూరిలో ఉన్నాను. వాళ్ళు నన్ను బలవంతంగా ఆ రాత్రికి అక్కడే ఉండమని నిర్బంధించి నిలిపివేశారు. కానీ, నాలో ఏదో ఆవేదన ఆరాటమూ ఆరంభమైంది. ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఉదయమే ఇంటికి వెళ్ళిపోయాను. ఆ రాత్రి మా అమ్మకు అకస్మాత్తుగా జబ్బు చేసి చాలా బాధపడినపుడు బిడ్డ హృదయం దానంతటి కదే బాధ పడుతుందేమో! అందుకే పాప పరిహారార్థం ఆవేదనలను కల్పించుకోవలసి వచ్చినపుడు ఇట్లా కబుర్లు పంపుతూ వచ్చారనుకొంటాను. ఈ దృష్టితో ఆలోచించినపుడు మీరు ఆవేదన పడినట్టే మీ అమ్మాయి కూడా ఆవేదన పడి ఉంటుంది. "అయ్యో! నాన్న, అమ్మ ఎలా బాధ పడుతున్నారో! ఎలా ఏడ్చుకొంటున్నారో! చావు కబురు సామాన్యమైందా" అని ఆమె ఆలోచిస్తూ మిమ్మల్ని గురించి ఆవేదన పడుతూ ఉండి ఉంటుంది. అందరూ ఒకసారి ఆవేదన పడడం చేత ఒక రకమైన శిక్ష అనుభవించినట్లయింది. ఇందులో మరొక ఉద్దేశం కూడా ఉన్నది. చూడరాని దృశ్యాలను చూడకూడదు. ధర్మరాజును, ద్రౌపదిని శయ్యాగృహంలో చూచిన అర్జునుడు పాప పరిహారార్థం తీర్థయాత్ర చేశాడు. పక్షులను చూచినా అంతే.

ఎవరి ఆనందానికైనా భంగాన్ని కల్గించడం పాపం. ఆ పాప పరిహారార్థం తమ్ము తాము శిక్షించుకోవడం వుదాత్తమైన ఆదర్శం" అన్నాను.

"ఏమో! కన్నవారి కడుపు తీపి ఒక్కటే నాకు తెలుసు. ఏది మంచో, ఏది చెడో! ప్రపంచంతో నాకేం పని. మా అమ్మాయి బ్రతికింది. ఇది పునర్జన్మ అంతే చాలు" అన్నారాయన.